
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 6 । మే । 2023



నృసింహుని కల్యాణం

పెంచలకోనలో శుక్రవారం పెనుశిల లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణ మహోత్సవం, రథోత్సవం కనులపండువగా జరిగింది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,696
3 శాతం జీఎస్టీతో	రూ.5,867
సవర (8 గ్రా)	రూ.46,936

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.9 /28.2

జిల్లాలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. శుక్రవారం గాలిలో 89 శాతం తేమ ఉంది. శని, ఆదివారాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

కూరగాయలతో కాసుల పంట

- కలిగిరి మండలంలో పెరిగిన సాగు
- నాగిరెడ్డిపాళెం కేంద్రంగా రోజూ ఎగుమతి
- నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుంటూరు మార్కెట్లకు తరలింపు
- కూలీలకు చేతి నిండా పని
- సాగులో మహిళలు కీలకం

జిల్లాలో కూరగాయల పంటల ఎగుమతులకు కలిగిరి మండలంలోని నాగిరెడ్డిపాళెం సెంటర్ పెట్టింది పేరు. నాలుగు దశాబ్దాల క్రితం చుట్టుపక్కల మండలాలకు ఎగుమతితో ప్రస్థానం ప్రారంభమైంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు సరఫరా చేసే స్థాయికి ఇక్కడ పంటల ఉత్పత్తి పెరిగింది. ఒకప్పుడు నాగిరెడ్డిపాళేనికే కూరగాయల సాగు పరిమితమైంది. నేడు చుట్టు పక్కల గ్రామాల్లోనూ విస్తారంగా సాగు జరుగుతోంది.

30 ఏళ్లుగా కూరగాయల సాగు



ఈయన పేరు షేక్ ఖాజావలీ. 30 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం దోసకాయలు ఒక ఎకరాలో, చిక్కుడు ఒక ఎకరాలో వేశాడు. సంత ఏర్పాటు కాకముందు ఎడ్ల బండిపై గ్రామాల్లో తిరుగుతూ దోసకాయలు, గెనుసు గడ్డలు అమ్మేవాడు. ప్రస్తుతం తాను పండించిన కూరగాయలను రోజూ సంతకు తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సంత వల్ల ఆదాయం బాగుందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కలిగిరి మండలంలోని నాగిరెడ్డిపాళెం కేంద్రంగా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఉంది. ఇక్కడి రైతులే వ్యాపారులుగా ఉంటారు. కూరగాయలను నెల్లూరు, కావలి, ఒంగోలు, గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. దళారుల ప్రమేయం లేకపోవడంతో ధరలు బాగా లభిస్తుంటాయి. ఆ ప్రాంతం కేంద్రంగా కూరగాయల సంతను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి వందలాది బస్తాల్లో వివిధ రకాల కూరగాయలను నిత్యం ఎగుమతి చేస్తుంటారు.

సంత ఏర్పాటుతో..

40 సంవత్సరాల క్రితం ఈ ప్రాంత రైతులు ప్రధానంగా గెనుసు గడ్డలు, జొన్న, సజ్జ, రాగులు పండించి జీవనం సాగించేవారు. కొంతమంది రైతులు దోసకాయల పంటను సాగు చేయడం ప్రారంభించారు. తాము పండించిన దోసకాయలు, గెనుసు గడ్డలను ఎడ్ల బండ్లపై పెట్టుకుని గ్రామాల్లో తిరుగుతూ అమ్మకాలు జరిపేవారు. కాలక్రమేణా రవాణా సౌకర్యాలు మెరుగు పడడంతో నాగిరెడ్డిపాళెం సెంటర్‌లో సంతను ఏర్పాటు చేసుకుని పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు తరలించడం మొదలైంది.

ఒకరిద్దరితో మొదలై..



బస్తాల్లో నాగిరెడ్డిపాళెం సంతకు తెచ్చిన కూరగాయలు

రైతులు ఒకే రకం పంటపై ఆధారపడకుండా వివిధ రకాల కూరగాయలు సాగు చేయడం ప్రారంభించారు. దీంతో అన్ని రకాల కూరగాయలు ఒకేచోట లభ్యం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎగుమతులకు అవకాశం ఏర్పడింది. ఒకరిద్దరితో ప్రారంభమైన కూరగాయల సాగు ప్రస్తుతం చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఇదే ప్రధానంగా మారింది. కలిగిరి నుంచి వ్యాపారులు నిత్యం సంతకు వచ్చి కూరగాయలు తమ దుకాణాలకు తీసుకెళ్తుంటారు. ఇంకా కొండాపురం, ఏఎస్‌పేట, లింగసముద్రం మండలాలకు తరలిస్తుంటారు. రోజూ మార్కెటింగ్ జరుగుతుండటంతో ఈ ప్రాంతంలో కూరగాయలు సాగు చేసే రైతులు తాము పండించిన పంటను సులభంగా అమ్ముకునే అవకాశం ఏర్పడింది.

వేలాది మందికి ఉపాధి

మండలంలోని అనేక గ్రామాల్లోనూ కూరగాయలను పండిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కూలీలకు నిత్యం చేతి నిండా పని దొరుకుతోంది. రవాణా చేసేందుకు ఆటోలకు బాడుగులు లభిస్తుంటాయి. నాగిరెడ్డిపాళెం సంత కేంద్రంగా వందలాది మంది రైతులు కూరగాయలు పండిస్తుంటే.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి దొరుకుతోంది. ప్రతి రైతు నిత్యం పదిమందికి ఉపాధి కల్పిస్తున్నాడు. ప్రధానంగా మహిళలు సాగుతోనే బిజీగా గడుపుతున్నారు. మొక్కలు నాటడం నుంచి కాయలు కోసి మార్కెట్‌కు తరలించే వరకు వారిదే ప్రధాన పాత్ర. పల్లెలంతా ఉద్యాన పంటలతో కళకళలాడుతున్నాయి.



చిక్కుడు పంట



దొండకాయల సాగు



కూరగాయలను వాహనంలో లోడ్ చేస్తున్న కూలీలు

ప్రభుత్వ ప్రోత్సాహం

నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురిశాయి. భూగర్భ జలమట్టం పెరిగింది. దీంతో ఉద్యాన పంటలు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం ప్రోత్సహించడంతో సాగు పెరిగింది. నాగిరెడ్డిపాళెం ప్రాంతంలో నీటి వసతి ఉండడంతోపాటు భూములు కూరగాయల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఉద్యాన శాఖ అధికారులు కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. రాయితీలపై అన్నదాతలకు అవగాహన కల్పించారు. పలువురు శాస్త్రవేత్తలను తీసుకొచ్చి తరచూ రైతులకు సదస్సులు నిర్వహించడంతో వారు క్రమంగా కూరగాయల సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. స్థానికంగా ఒక నర్సరీ ఉంది. అలాగే కలిగిరి, వింజమూరు ప్రాంతాల్లో విరివిరిగా నర్సరీలు ఏర్పాటు కావడంతో కూరగాయల నారు రైతులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఆధునిక యాజమాన్య పద్ధతులతో కూరగాయలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఉద్యాన శాఖ పందిర్ల ద్వారా కూరగాయల సాగును ప్రోత్సహిస్తోంది. ఒక ఎకరా పందిళ్ల సాగుకు రూ.2 లక్షలు ఖర్చవుతుండగా ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇచ్చి రూ.లక్షకే అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా డ్రిప్, సూక్ష్మ బిందు సేద్యం పరికరాలను ఇస్తున్నారు. కూరగాయల విత్తనాలు, ఎరువులు కూడా సబ్సిడీతోపై అందజేస్తున్నారు. కలుపు నివారణకు మల్చింగ్ షీట్లను ఇవ్వడం జరుగుతోంది.

నిత్యం ఎగుమతులు



నాగిరెడ్డిపాళెం సంత నుంచి నిత్యం భారీగా కూరగాయలు ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం వేసవి కావడంతో రోజూ 150 నుంచి 200 బస్తాల వరకు కూరగాయలు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దోసకాయలను మాత్రం వ్యాపారులు పొలాల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

– అక్కెం హజరత్‌రెడ్డి, వ్యాపారి, నాగిరెడ్డిపాళెం

దొండ సాగుతో లాభాలు

దొండ సాగు లాభసాటిగా ఉంది. ఒక్కసారి నాటితే మూడేళ్లపాటు దిగుబడి వస్తుంది. ఎకరాకు తొలుత రూ.2.50 లక్షల వరకు ఖర్చయితే సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఆదాయం వస్తుంది. మిగిలిన పంటల్లో కూడా ఆశాజనకంగా దిగుబడులు, ధరలు ఉండడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

న్యూస్‌రీల్

ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా ఉమాశంకర్



ఉమాశంకర్

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా ఈఈగా ఉమాశంకర్ శుక్రవారం నెల్లూరు పెద్దాస్పత్రి ఆవరణలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.విజయ్‌భాస్కర్‌ను ప్రభుత్వం ఒంగోలుకు బదిలీ చేసింది. ఏలూరులో విధుల్లో ఉన్న ఉమాశంకర్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఉమాశంకర్ మాట్లాడుతూ పెద్దాస్పత్రిలో అదనపు బ్లాక్‌ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి, కావలి ఏరియా ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఆక్సిజన్ ప్లాంట్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలతోపాటు అన్ని హాస్పిటళ్లకు సకాలంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులను సరఫరా చేస్తామన్నారు.

3,03,108 మందికి పింఛన్ల పంపిణీ



లక్ష్మమ్మతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ నాగేశ్వరరావు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ శుక్రవారంతో పూర్తయింది. మొత్తం 3,06,799 మందికి గానూ 3,03,108 మందికి గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నగదు అందజేశారు. 98.8 శాతం మందికి కానుక పంపిణీ చేశారు.

రైళ్లపై రాళ్లు రువ్వితే కేసులు

నెల్లూరు(క్రైమ్): తిరుపతి జిల్లాలో ఇటీవల వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన రాళ్లదాడి నేపథ్యంలో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఆ రైలు ప్రయాణించే వేళల్లో అన్ని రైల్వేస్టేషన్ల వద్ద సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రైల్వే ఆస్తులకు, రైళ్లకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు తప్పవని ప్రయాణికులను, ప్రజలను హెచ్చరిస్తున్నారు.

నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్ష ఫలితాలు శనివారం ఉదయం విడుదలవుతాయని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఉదయం 11 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బి.సత్యనారాయణ ఫలితాలను విడుదల చేస్తారన్నారు. పరీక్షలు గతనెల 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించామన్నారు. 27,291 మంది రెగ్యులర్, 2,100 మంది ప్రైవేట్ విద్యార్థులు 172 సెంటర్లలో పరీక్షలు రాశారని తెలిపారు.

8న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

నెల్లూరు(టౌన్): కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఉదయం 10 గంటలకు ఈ మేళా ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తగిన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలన్నారు.

సోమశిలలో 49.789 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 49.789 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 181 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 2,450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 96.272 మీటర్లుగా ఉంది.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

- జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి శుక్రవారం ఆయన జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని, అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రాజీమార్గం ప్రాధాన్యతను ఇరువర్గాలకు తెలియజేసి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసులతోపాటు దంపతుల మధ్య అపరిష్కృతంగా కోర్టుల్లో ఉన్న కేసుల్లో ఉభయపక్షాల వారికి రాజీ కుదిర్చి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చన్నారు. ఆ దిశగా ఉభయపక్షాలు ఆలోచన చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. క్షణికావేశాలకు లోనై జీవితాంతం న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో మంటలు

- రూ.3.5 లక్షల విలువైన శానిటేషన్ సామగ్రి దగ్ధం

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) శానిటేషన్ గదిలో విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సీహెచ్‌సీ ప్రాంగణంలోని గదిలో వెంకటాచలం, పొదలకూరు సీహెచ్‌సీలకు సరఫరా చేయాల్సిన శానిటేషన్ సామగ్రిని సంబంధిత కాంట్రాక్టర్ కొన్నినెలల నుంచి ఉంచారు. ఆ గదిలోనే ఒక్కసారి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం కారణంగా సుమారు రూ.3.5 లక్షల విలువైన శానిటేషన్ సామగ్రి మంటల్లో కాలిపోయిందని కాంట్రాక్టర్ రాజ్ తెలిపారు.



గది బయట పెట్టిన డ్రమ్ములు

అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం



బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని 23వ డివిజన్ పడారుపల్లి దివ్యాంగుల కాలనీలో శుక్రవారం సాయంత్రం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రతి గడపకు వెళ్లి పథకాలు పక్కాగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. పథకాల వల్ల ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల కోసం పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రూరల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మద్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు హరిబాబు యాదవ్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్ బదిలీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు మూలాపేటలోని ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్ ఎస్.కిశోర్‌కుమార్ విశాఖపట్నం సెంట్రల్ జైలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాజారావు ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

జిల్లాలో అకాల వర్షం

- మరో మూడురోజులపాటు వానలు
- పంటలకు నష్టం కలిగితే తెలియజేయాలి
- కలెక్టర్ కార్యాలయం వెల్లడి



సంగంలో కురుస్తున్న వర్షం

నెల్లూరు(అర్బన్): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పలుచోట్ల అకాల వర్షం కురిసింది. నాలుగైదు మండలాల్లో భారీ వర్షాలు, మిగిలిన చోట్ల ఓ మోస్తరు వానలు పడ్డాయి. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంది. మధ్యాహ్నానికి వింజమూరు, ఏఎస్‌పేట, సంగం తదితర మండలాల్లో గంటపాటు భారీ వర్షం కురిసింది. నెల్లూరులోని పలు ప్రాంతాలు, కొండాపురం, కలిగిరి మండలాల్లో మోస్తరు వాన పడింది. ఇందుకూరుపేట, చేజర్ల, కోవూరు, వరికుంటపాడు, రాపూరు, ఆత్మకూరు, కొడవలూరు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. వర్షాలతో ఏఎస్‌పేట, వింజమూరు తదితర ప్రాంతాల్లోని మామిడి తోటల్లో ఉన్న కాయలు నేలరాలాయి. ఏ మేరకు నష్టం వాటిల్లిందో శనివారానికి తెలియనుంది. వరికోతలు జిల్లాలో దాదాపుగా పూర్తయ్యాయి. ఒకటి అరచోట్ల జరుగుతున్నాయి. అందువల్ల పంటలకు పెద్దగా నష్టం లేదు. ప్రజలు ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం పొందారు.

- నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని శనివారం నుంచి మూడురోజులపాటు ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అకాల వర్షాలకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం కలిగితే వ్యవసాయ శాఖకు సంబంధించి 94910 00129, ఉద్యాన శాఖకు సంబంధించి 86864 34629 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇంకా సమస్యలను జిల్లా కేంద్రంలోని కాల్‌సెంటర్ 1077 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని కొమ్మరపూడి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. గ్రామానికి చెందిన పోట్లూరి లక్ష్మయ్య (46) పొలంలో గేదెలు మేపుతున్న సమయంలో పిడుగు పడింది. దీంతో అతను అక్కడికక్కడే మరణించాడు. లక్ష్మయ్యకు భార్య నలుగురు కుమార్తెలున్నారు. రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుబ్బయ్యకు సమాచారం అందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.



లక్ష్మయ్య మృతదేహం

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- కళ్యాణమస్తు, షాదీ తోఫా నగదు జమ

జిల్లాలో..	
లబ్ధిదారులు	361 మంది
నగదు	రూ.2.91 కోట్లు



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులు

నెల్లూరు(అర్బన్): 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉంది. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది.' అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో బటన్ నొక్కి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల లబ్ధిదారులకు నగదు జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, లబ్ధిదారులు హాజరయ్యారు. అనంతరం అరుణమ్మ, కూర్మనాథ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డలకు పెళ్లిళ్లు ఆర్థిక భారం కాకూడదని భావించిన ప్రభుత్వం ఈ సాయం చేస్తోందన్నారు. పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రి గట్టిగా నమ్మారన్నారు. అందుకే అమ్మాయిలు కనీసం పదో తరగతి పాసై ఉండాలన్న నిబంధనను ఈ పథకానికి అర్హతగా నిర్ణయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వారికే కాకుండా దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు సైతం ఈ పథకాలు వర్తింపజేయడం సంతోషకరమన్నారు. జిల్లాలోని 361 మంది లబ్ధిదారులకు కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఇందుకోసం రూ.2.91 కోట్లను కేటాయించారు. భారీ నమూనా చెక్కును అరుణమ్మ, కూర్మనాథ్ లబ్ధిదారులకు అందజేశారు.

చాలా ఆనందంగా ఉంది



మా వివాహానికి సంబంధించి ప్రభుత్వం రూ.75 వేలు ఆర్థిక సాయం అందించింది. చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబంలో ఒకరిగా ఉన్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. మేం ఎక్కడికీ వెళ్లకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్నాం. నేరుగా మా బ్యాంక్ ఖాతాలో నగదు జమైంది.

– దొనెపూడి వంశీకృష్ణ, సుజన దంపతులు, ఇస్కపల్లి, అల్లూరు మండలం

అప్పులపాలు కాకుండా ఆదుకున్నారు



మా పెళ్లికి సంబంధించి ప్రభుత్వం రూ.లక్ష సాయం చేయడం వల్ల అప్పులు తగ్గాయి. ప్రభుత్వం ఆదుకోవడం సంతోషకరం. పేదవాళ్లని గుర్తించి పెద్దఎత్తున ఆర్థిక సాయం చేస్తున్న ఇలాంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదు. పేదల పక్షపాతి జగనన్నకు రుణపడి ఉంటాం.

– పి.అయాజ్, నౌషీన్ దంపతులు, బుచ్చిరెడ్డిపాళెం

నయనానందం.. నృసింహుని కల్యాణం



అలంకార మండపంలో పూజలు చేస్తున్న అర్చకుడు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

- దేవదేవేరులకు పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ
- కనులపండువగా రథోత్సవం
- విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

రాపూరు: వేదమంత్రాలు.. మంగళవాయిద్యాలు.. ముత్యాల తలంబ్రాలు.. నమో నారసింహా స్మరణల నడుమ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నయనానందకరంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెంచలకోనలో దేవదేవేరుల కల్యాణ ఘట్టాన్ని వీక్షించేందుకు వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. ముందుగా ఉదయం 10 గంటలకు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ ఉగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువు దీర్చారు. అనంతరం శోభాయమానంగా తీర్చిదిద్దిన కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. వేదపండితులు తొలుత శ్రీవారు, అమ్మవార్లకు భాసికం, కంకణాలు ధరింపజేశారు. విష్వక్సేన పూజ అనంతరం దేవదేవేరుల గోత్రాలు చెప్పి కన్యాదాన కార్యక్రమం నిర్వహించారు. సుముహూర్తంలో మంగళసూత్ర ధారణ జరిపించారు. స్వామి కల్యాణం విశిష్టతను వేదపండితులు భక్తులకు వివరించారు. కల్యాణాన్ని పురస్కరించుకుని టీటీడీ తరఫున పేషీ అధికారి శ్రీహరి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవుడి పెళ్లి ముహూర్తంలో వేదిక వద్ద పలువురు నూతన వధూవరులు వివాహం చేసుకున్నారు. అనంతరం స్వామికి పెద్దసంఖ్యలో భక్తులు కానుకలు చదివించారు. దాదాపు రూ.1.24 లక్షలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లతోపాటు ఆంజనేయునికి ప్రత్యేక పూలంగిసేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, దేవదాయ శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, ఈఓ జనార్దనరెడ్డి, జొన్నవాడ ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, దేవుడు వెల్లంపల్లె ఈఓ శ్రీధర్, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పాల్గొన్నారు.



నృసింహుడి రథోత్సవం

రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథంపై స్వామి అమ్మవార్లతో కలిసి కోన తిరువీధుల్లో ఊరేగారు. రథంపై విహరిస్తున్న దేవదేవేరులను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 10 గంటలకు గజవాహనంపై స్వామి, అమ్మవార్లు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

నేడు చక్రస్నానం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు చక్రస్నానం, వసంతోత్సవం, అభిషేకం నిర్వహించనున్నారు. రాత్రి ఏడు గంటలకు శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వవాహనసేవ, 11 గంటలకు ధ్వజావరోహణ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో ఉద్యోగికి గాయాలు

ఆత్మకూరు: వేపాకు కోసేందుకు రోడ్డు పక్కనే ఉన్న చెట్ల వద్దకు మున్సిపల్ ఉద్యోగి వెళ్లగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేసిన ఘటన ఆత్మకూరు లో శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు మున్సిపల్ వాటర్ పంపింగ్ స్కీమ్‌లో పనిచేస్తున్నాడు. అతను నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వేపాకు కోసం రోడ్డు పక్కనున్న చెట్టు వద్దకు వెళ్లగా పక్కనే మరో చెట్టుపై నుంచి తేనెటీగలు చుట్టుముట్టాయి. దీంతో కేకలు వేస్తూ రోడ్డుపై పరిగెత్తాడు. కొద్దిసేపటి అనంతరం సమీపంలోని వారి సహాయంతో చికిత్స కోసం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేరాడు.

మీడియా ముసుగులో దందాలు

- ఒకరిపై పోలీస్ కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మీడియా ముసుగులో దందాలు, దౌర్జన్యాలు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ వ్యక్తి చివరికి కటకటాల పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీనివాసులు అనే వ్యక్తి ముత్తుకూరు మండల కేంద్రంగా ఓ టీవీ చానల్ రిపోర్టర్‌గా (సాక్షి కాదు) పని చేస్తున్నాడు. ఇటీవల ముత్తుకూరు మండలంలోని ఈపూరు గ్రామానికి చెందిన ఓ పూజారి కుటుంబానికి చెందిన స్థల వివాదంలో జోక్యం చేసుకుని వారిని బెదిరించి డబ్బు డిమాండ్ చేశాడు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన పూజారి కుటుంబం, మరికొందరు ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసులుపై ఫిర్యాదు చేశారు. సెక్షన్ 386 కింద గురువారం రాత్రి అతడిని అరెస్ట్ చేశారు. కోర్టుకు హాజరుపరిచారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 131
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 252
లేయర్ చికెన్	: 145



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.45
పండ్లు	: రూ.25



తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం

- వేగంగా భూముల రీ సర్వే
- ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్



నెల్లూరు(అర్బన్): జిల్లాలో అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలకు ఎక్కడైనా ధాన్యం తడిస్తే వాటిని పీపీసీల ద్వారా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లుకు తరలిస్తున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే దాదాపుగా వరి కోతలు అయిపోయాయన్నారు. కొన్నిచోట్ల మిగిలిన కోతలకు సంబంధించి ధాన్యం తడిస్తే వాటిని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏఎస్‌పేట మండలంలోని కొండమీద కొండూరు గ్రామంలో రెండు లారీల ధాన్యం తడిచినట్లు కొంతమంది రైతులు తమకు సమాచారమిచ్చారన్నారు. వెంటనే వాటిని కొనుగోలు చేయాలని సివిల్ సప్లైస్ డీఎంను ఆదేశించానన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు 450 మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కొనుగోలు చేసేందుకు టార్గెట్ ఉందన్నారు. అందువల్ల వారితో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని బ్యాంకు గ్యారెంటీలు తీసుకుని బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపేందుకు ఎఫ్‌సీఐ అధికారులతో మాట్లాడామన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం వరికి సంబంధించి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన దానికన్నా అదనంగా ధర లభించిందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరిన చోట మాత్రమే తాము పీపీసీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించామన్నారు.

- జిల్లాలో 118 గ్రామాల్లో భూముల రీ సర్వే పనులు జరుగుతున్నాయని కూర్మనాథ్ తెలిపారు. రోజుకు 2,500 నుంచి 3,000 వరకు హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 20 నాటికి తొలిదశ గ్రామాల్లోని అన్నిచోట్ల హద్దులకు సంబంధించి రాళ్ల నాటే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. భూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు త్వరలోనే అందిస్తామన్నారు.
- దశాబ్దాలుగా ఉన్న చుక్కల భూముల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపిందని కూర్మనాథ్ తెలిపారు. ఒక్క జీఓతో వాటిని సెటిల్‌మెంట్ భూములుగా మార్చిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఒకరికి తీవ్రగాయాలు

ముత్తుకూరు: ముత్తుకూరుకు సమీపంలోని సుబ్బారెడ్డిపాళెం బ్రిడ్జి వద్ద బూడిద మోసుకెళ్లే ఓ బల్కర్‌ను ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శివకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. నారికేళపల్లికి చెందిన బక్కా ప్రభు, తాడిపర్తి కిరణ్ (29) మోటార్‌బైక్‌పై శుక్రవారం సాయంత్రం ముత్తుకూరు నుంచి బయలుదేరారు. బలిజపాళెం దాటిన తర్వాత సుబ్బారెడ్డిపాళెం బ్రిడ్జి వద్ద బైక్ బల్కర్‌ను ఎడమవైపు ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఎదురుగా బొలెరో వాహనం వచ్చింది. దీంతో బల్కర్ డ్రైవర్ గమనించి వాహనాన్ని ఎడమవైపునకు మళ్లించాడు. బైక్‌పై వస్తున్న వ్యక్తులకు దారిలేక బ్రిడ్జి గోడ – బల్కర్ నడుమ చిక్కుకుపోయారు. ఈ దశలో బల్కర్ బైక్‌ను తొక్కుకొని, ఈడ్చుకొంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రభును చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



కిరణ్ మృతదేహం

క్రెడిట్ కార్డు పేరుతో టోకరా

కావలి: సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుకుని కావలికి చెందిన చిమట కిశోర్ అనే వ్యక్తి శుక్రవారం తన బ్యాంక్ ఖాతాలోని నగదు పోగొట్టుకున్నాడు. క్రెడిట్ కార్డు పేరుతో వివరాలు తెలుసుకుని కిశోర్ బ్యాంక్ ఖాతాల్లోని రూ.రూ.49,009ను కొట్టేశారు. దీంతో బాధితుడు తన ఖాతా ఉన్న జనతాపేటలోని ఎస్‌బీఐ అధికారులను సంప్రదిస్తే సైబర్ నేరగాడు డబ్బు కొట్టేశాడని చెప్పారు. ఈ క్రమంలో బ్రాంచ్ మేనేజర్ తనతో అమర్యాదగా వ్యవహరించాడని కిశోర్ వాపోయాడు. కావలి టు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాడు చేసిన ఫోన్ నంబర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పోలీసులు గుర్తించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కందుకూరు రూరల్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, నెల్లూరు జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్ అన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న తమలపాకు, మిరప తోటలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాచవరం గ్రామంలో 30 ఎకరాల్లో తమలపాకు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న ప్రతి పంటకు నష్ట పరిహారం అందజేస్తామన్నారు. గత మార్చి నెలలో కురిసిన వర్షాలకు 23 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, వాటికి రూ.33 కోట్ల నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా మళ్లీ ఏప్రిల్‌తోపాటు మే నెలలో వర్షాలు కురుస్తున్నాయన్నారు. వీటి వల్ల ఏర్పడే నష్ట వివరాలను కూడా రైతుల ద్వారా సేకరించి జూన్ నెలలో పరిహారం అందిస్తామని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్, సబ్ కలెక్టర్ శోభిక, జిల్లా వ్యవసాయాధికారి జి.సుధాకర్‌రాజు, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ సీతారామయ్య, ఏడీఏ శేషగిరి, ఏఓలు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ హరికిరణ్

డబ్బుకు ఆశపడి గంజాయి రవాణా

- ఎస్‌ఈబీ అధికారులకు చిక్కిన ముఠా
- వారిలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు
- 18 కేజీల గంజాయి, ఐదు మొబైల్స్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ హిమవతి

నెల్లూరు(క్రైమ్): కమీషన్‌కు ఆశపడి హోల్‌సేల్ వ్యాపారి నుంచి కొనుగోలుదారులకు గంజాయిని చేరుస్తున్న ఓ ముఠా గుట్టును ఎస్‌ఈబీ అధికారులు రట్టు చేశారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం ఏఎస్పీ, ఎస్‌ఈబీ క్రైమ్ ఇన్‌చార్జి డి.హిమవతి ముఠా వివరాలను వెల్లడించారు. మాదకద్రవ్య రహిత జిల్లానే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. ఏఎస్పీ పర్యవేక్షణలో ఎస్‌ఈబీ, పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా దాడులు ముమ్మరం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌ఈబీ పోలీస్ టీం ఇన్‌స్పెక్టర్ హెచ్‌ఎస్ హుస్సేన్‌బాషా, కావలి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు ముమ్మరం చేశారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కుల్లంపట్టి ప్రాంతానికి చెందిన రమేష్‌రాజు, కాకినాడ జిల్లా శంఖవరం మండలం కొత్తంగి గ్రామానికి చెందిన ఆర్.గణేష్, విశాఖ జిల్లా రోలుగుంట మండలానికి చెందిన కె.సాయి, కాకినాడ జిల్లా శంఖవరం మండలానికి చెందిన ఎం.అనంత, పత్తిపాడు మండలం దారాపల్లి గ్రామానికి చెందిన ఎస్.లోవాకుమారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 18 కేజీల గంజాయిని, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారించి కమీషన్ పద్ధతిపై సేలం, కేరళ రాష్ట్రంలోని వారికి గంజాయి చేరుస్తున్నారని గుర్తించారు.

కమీషన్ తీసుకుంటూ..

రమేష్‌రాజు లారీ డ్రైవర్. ఆరునెలల క్రితం యాక్సిడెంట్ కావడంతో కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. దీంతో డ్రైవింగ్ చేయడం కష్టతరంగా మారింది. అతని యజమాని గంజాయి విక్రయదారుడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగరాజుమాడుగు (జి.మాడుగు)ల ప్రాంతానికి చెందిన సరఫరాదారుని వద్ద గంజాయి కొనుగోలుచేసి సేలంతోపాటు సమీప ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. రమేష్‌రాజు పరిస్థితిని చూసిన ఆయన జి.మాడుగల నుంచి గంజాయి తనకు తెచ్చి ఇచ్చిన ప్రతిసారి రూ.10 వేలు కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. దీంతో రమేష్‌రాజు కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తెచ్చి ఇస్తున్నాడు.

- ఆర్.గణేష్, కె.సాయి, ఎం.అనంత, ఎస్.లోవాకుమారి రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేసేవారు. సంపాదన సరిపోవడంలేదని జి.మాడుగలకు చెందిన గంజాయి సరఫరాదారుడితో పరిచయం పెంచుకున్నారు. ఆయన కేరళలో తాను చెప్పిన వ్యక్తులకు గంజాయి ఇచ్చిన ప్రతిసారి రూ.10 వేలు కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. వారు కొంతకాలంగా జి.మడుగుల నుంచి కేరళకు గంజాయిని తీసుకెళ్లి అక్కడ విక్రయదారులకు ఇస్తున్నారని విచారణలో బయటపడింది. ఐదుగురితోపాటు జి.మాడుగులకు చెందిన గంజాయి హోల్ సేల్‌సరఫరాదారుడు, అతని బావమరిదిపై సైతం ఎస్‌ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు. సమావేశంలో ఎస్‌ఈబీ ఈఎస్ ఎస్.రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, పోలీస్ టీం ఎస్సై బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.